## క్లుప్తంగా

### నల్లబర్లీ పొగాకు సాగు చేయొద్దు



ఫిరంగిపురం: నల్లబర్లీ పొగాకు సాగు చేయొద్దని ఏవో వాసంతి అన్నారు. తక్కెళ్లపాడులో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యాన నల్లబర్లీ పొగాకు సాగుపై ఉన్న నిషేధంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో వాసంతి మాట్లాడుతూ గతేడాది నల్లబర్లీ పొగాకు సాగు చేసిన రైతులు కొనుగోలు సమయంలో ఇబ్బంది పడ్డారన్నారు. దీంతో ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు క్రాప్ హాలిడే ప్రకటించినట్లు తెలిపారు. ఎవరైన దాన్ని సాగుచేస్తున్నట్లు గుర్తిస్తే పంటను దున్ని స్తామని పంట నమోదు చేయరన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రసాదరావు, సీఐ శివరామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

### పచ్చదనం, పరిశుభ్రతపై శిక్షణ



ఫిరంగిపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆర్‌జీఎస్ఏ- ఎల్ఎస్డీజీ -5థీమ్‌లో భాగంగా పచ్చదనం -పరిశుభ్రత వంటి అంశాలపై సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా (ఎస్‌డబ్ల్యూపీసీ) షెడ్డు వద్ద పరిసరాల శుభ్రత, గ్రామంలో తడిపొడి చెత్త సేకరణ వంటి అంశాలను వివరించారు. పారిశుద్ధ్య కార్మికులు తడిపొడి చెత్తను సేకరించి దానిని వేరుచేసి నిల్వ ఉంచి సంపద సృష్టించడంపై సూచనలు చేశారు. పరిశుభ్రత, పచ్చదనం పెంపునకు చేయాల్సిన పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### రేపు శ్రీనివాస కల్యాణం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 16వ తేదీ గురువారం శ్రీనివాస కల్యాణం పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవదాయ ధర్మదాయ శాఖ ఈవో బి. సురేష్ మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి కేరళ డీజీపీ చంద్రశేఖ రఆజాద్ హాజరవుతారని పేర్కొన్నారు.

### అంగన్‌వాడీ టీచర్ కుమారుడికి పీహెచ్‌డీ




తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి పెనుమాకలో నివసించే అంగన్‌వాడీ టీచర్ కుమారుడు మంగళవారం పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. పెనుమాకలో అంగన్‌వాడీ టీచర్ లూర్దుమేరీ కుమారుడు ఏటుకూరి నాగార్జున బాబు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో పరిశోధన చేశారు. దీని నిమిత్తం నాగార్జున బాబు ఈవాల్యేషన్ ఆఫ్ ఫార్మకాలజికల్ యాక్టివిటీ ఆఫ్ సెలెక్టెడ్ ఫ్లేవోనాయిడ్ ఆన్ కెమికల్ ఇన్ డ్యూసెడ్ న్యూరాలజికల్ డిజార్డర్స్ అండ్ ఇట్స్ కొరిలేషన్ విత్ బయో కెమికల్ న్యూరో కెమికల్ అండ్ హిస్టోలాజికల్ ఆల్టరేషన్ ఇన్ రాట్ బ్రెయిన్ అనే అంశంపై పరిశోధన చేశారు. పరిశోధనా సంచాలకులు ఆచార్య పి. సుధాకర్ పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ ఆనందం వ్యక్తం చేశారు.

### టిడ్కో సముదాయం వద్ద వాటర్ ప్లాంట్

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని టిడ్కో గృహ సముదాయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి ప్లాంట్‌ను మంగళవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో రూ.16 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ నిర్మించినట్లు పేర్కొన్నారు. రోజుకు 20 గంటలు పనిచేస్తుందని, గంటకు వెయ్యి లీటర్లను ప్యూరిఫై చేస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు.

### సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు పరిశీలన



దుగ్గిరాల: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అర్జునరావు పరిశీలించారు. దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో క్లీన్ అండ్‌గ్రీన్ విలేజ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ స్వరూపారాణి, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అరకొరగా తాగునీరు



మరమ్మతులకు గురైన మోటార్ ఇక్కడే ఉంది

తాడేపల్లి రూరల్: ఉండవల్లి దళితవాడకు, బాపనయ్యనగర్‌కు తాగునీరు అరకొరగా అందుతోంది. ఉండవల్లి గుంటూరు చానల్ లాకుల వద్ద.. ఉండవల్లి అమరావతి రోడ్డు నుంచి గుంటూరు చానల్ మీదుగా దళితవాడకు వెళ్లే దారిలో గతంలో ఉండవల్లి హరిజవాడ ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు, బాపనయ్యనగర్‌కు తాగునీరు అందించేందుకు 7.5 విద్యుత్ మోటారు ఒకటి, 5.5 విద్యుత్ మోటారు ఒకదాన్ని ఏర్పాటు చేశారు. ఈ రెండు విద్యుత్ మోటార్లలో 7.5 విద్యుత్ మోటారు ద్వారా ఉండవల్లి దళితవాడకు తాగునీరు పంపించి, ట్యాంకును ఫుల్ చేసి గ్రావెటిద్వారా ప్రజలకు అందించేవారు. 5.5 విద్యుత్ మోటారు ద్వారా బాపనయ్య నగర్‌కు డైరెక్ట్ పంపింగ్ ద్వారా పంపేవారు.

**మరమ్మతులు చేయకుండా వదిలేశారు**

రెండు నెలల క్రితం 7.5 విద్యుత్ మోటారు మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి కార్పొరేషన్ అధికారులు దానిని మరమ్మతులు చేయించకుండా వదిలివేశారు. దళితవాడలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు 7.5 విద్యుత్ మోటారును ఉపయోగించి నాలుగు గంటల్లో ట్యాంక్ ఫుల్ చేసేవారు. ఇప్పుడు 5.5 విద్యుత్ మోటారుతో నీరు పంపించడంతో ఆరు గంటలకు పైగా సమయం పడుతోంది. సమయ పాలన లేకుండా తాగునీరు విడుదల చేయడంతో ఆ ప్రాంత ప్రజలతో పాటు బాపనయ్య నగర్ ప్రజలు కూడా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. వెంటనే అధికారులు స్పందించి 7.5 విద్యుత్ మోటారుకు మరమ్మతులు చేసి తాగునీటి సమయ పాలన కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.

## సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కలిగిస్తున్న వైద్యులు

మంగళగిరి టౌన్: సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిటిటేషన్) పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు పేర్కొన్నారు. సీపీఆర్‌పై వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లి డ్రైవర్స్ కాలనీలోని యూపీహెచ్‌సీలో హాస్పిటల్ సిబ్బందికి స్థానిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ఎయిమ్స్ వైద్యులు మాట్లాడుతూ సీపీఆర్ ప్రక్రియ ద్వారా రోగిని కాపాడవచ్చని, ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు ఈ నెల 17 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు రోగికి మెదడు, గుండె ఇతర ముఖ్య అవయవాలకు రక్తప్రసరణ ఆగిన సమయంలో సీపీఆర్ అవసరం అవుతుందని, ఇది చేస్తే అవయవాలకు ఆక్సిజన్ సరఫరా ఏర్పడి రోగి బతికే అవకాశాలు ఉంటాయని తెలియజేశారు. గుండెపోటు వచ్చిన వ్యక్తికి తక్షణమే ప్రథమ చికిత్సను అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. ఆకస్మికంగా గుండెపోటుతో కుప్పకూలితే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేస్తే నిండు జీవితాన్ని కాపాడిన వారవుతారన్నారు. అనంతరం సీపీఆర్ ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు అనంత ప్రకాష్, విఘ్నేష్, నర్సింగ్ అధికారి రవి, డాక్టర్ విక్రమ్ కృష్ణ, వివేక్, ఆయా ప్రాంతాల యూపీహెచ్‌సీ వైద్యులు మానస, హర్షవర్ధన్, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఉర్దూ స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం షాజీర్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

దుగ్గిరాల: పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామంలో పలువురు పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేశారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

## చెక్కుల పంపిణీ

తాడేపల్లి రూరల్ : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు మంగళవారం వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు అందజేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఇద్దరికి రూ.3,23,096 విలువైన చెక్కులు అందజేశారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

## కార్పొరేట్‌ల కోసమే 'కేంద్రం'

సీపీఐ మంగళగిరి కార్యదర్శి తిరుపతయ్య



సమావేశంలో మాట్లాడుతున్న చిన్ని తిరుపతయ్య

మంగళగిరి టౌన్: ప్రజా సమస్యలను పక్కన పెట్టి కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల కోసమే పని చేస్తోందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడిదారీ వ్యవస్థలకు దాసోహం అనేలా విధానాలు అవలంబిస్తోందని పేర్కొన్నారు. హక్కులను హరించేలా కార్మిక చట్టాలను మార్చడం ప్రజా వ్యతిరేక విధానమన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలపై దృష్టి పెట్టి వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, పట్టణ కార్యదర్శి ప్రభాకర్, నాయకులు పత్తెవరపు వెంకట శివప్రసాద్, వెంకటేశ్వరరావు, భాస్కర్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య రహిత దీపావళిని జరుపుకోవాలి



విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న ఎంటీఎంసీ అధికారులు

మంగళగిరి టౌన్: కాలుష్యం లేని దీపావళిని జరుపుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సూచించారు. నగర పరిధిలోని వీవర్స్ కాలనీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఎకో ఫ్రెండ్లీ దీపావళిపై అవగాహన కలిగించారు. విద్యార్థులతో కలసి ప్లకార్డులు, నినాదాలు చేస్తూ నగరంలోర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా టపాసులు పేలిస్తే గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. కాలుష్యరహిత పండుగను చేసుకునే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇందు, కరుణ, శ్రీనివాస్, ఐజీసీ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ శంకర్, పాఠశాల చైర్మన్ హనుమాన్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించండి



బీసీ వసతి గృహం విద్యార్థులతో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి, నాయకులు

తాడికొండ: బీసీ వెల్ఫేర్ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఎ. మాల్యాద్రి అన్నారు. మంగళవారం తాడికొండలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్ ను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహానికి చెందిన విద్యార్థులు డిగ్రీ, ఇంటర్మీడియెట్, బీటెక్ చదవడానికి గుంటూరు, లాం మోతడక ప్రాంతాలకు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారని, కాలేజీ వేళల్లో సరైన బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులు గత అక్టోబరులో తాడికొండలో బస్సులు ఆపడం లేదని గుంటూరు డిపోకు వెళ్లి ఫిర్యాదు చేయగా సమస్య ఇప్పటివరకు పరిష్కారం కాలేదని మండిపడ్డారు. వసతి గృహ ప్రాంగణంలో దోమలు అధికంగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఇప్పటివరకు దుప్పట్లు ఇవ్వలేదని విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఫీజు రీ యింబర్స్‌మెంట్ కొంతమంది విద్యార్థులకు అందలేదని, దీంతో కాలేజీ యాజమాన్యం విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తుందన్నారు. హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకు మూడు బాత్రూమ్‌లు ఉన్నాయని, ఇవి విద్యార్థులకు ఏమాత్రం సరిపోవని అదనంగా బాత్రూంలు నిర్మించాలని డిమాండ్ చేశారు. వారానికి రెండుసార్లు ఇస్తున్న మాంసం 50 మందికి ఐదు కిలోలు మాత్రమే అందిస్తున్నారని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్క విద్యార్థికి 200 గ్రాములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జొన్నకూటి ప్రకాష్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గోతులే గోతులు!



గుంతలతో అధ్వానంగా తుళ్లూరు వెళ్లే ప్రధాన రహదారి



రాజధానికి వెళ్లే ప్రధాన మార్గం ఇలా..

రాజధాని అమరావతికి వెళ్లే ప్రధాన రహదారి నరకానికి నకలుగా మారింది. ఇసుక లారీలు, రాజధాని నిర్మాణ సామగ్రి తరలింపునకు భారీ వాహనాల రాకపోకలు, ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గుంతల మయంగా మారింది. చిన్నపాటి గుంతలకు మరమ్మతులు చేసే నాథుడు కరువవడంతో అవి కాస్తా పెద్దవిగా మారాయి. నాలుగు అడుగుల మేర పడిన పెద్ద పెద్ద గుంతలు కార్లు, ద్విచక్ర వాహనాల రాకపోకలు ఇబ్బందిగా మారాయి. ఈ ప్రాంతం నిత్యం వీఐపీలు, వీవీఐపీల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. జడ్జిలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సైతం ఈ మార్గం మీదుగా నిత్యం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి సత్వరమే రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. –తాడికొండ

## బాల్య వివాహాలతో అనర్థాలు



ఫిరంగిపురం: బాల్య వివాహాలతో అనర్థాలు కలుగుతాయని హెల్త్ సూపర్‌వైజర్ కె.సుదర్శన్‌రాజు చెప్పారు. మునగపాడు జెడ్పీ పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే బాలికలకు అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. ప్రతి రోజూ పోషకాహారం తీసుకోవాలన్నారు. ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండగలుగుతారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీ సుజాత, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని దీనాపూర్ క్యాంపస్‌లోని రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాలలో ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్‌ఫేర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికాదినోత్సవం మంగళవారం నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి శ్రీవాణి మాట్లాడుతూ బాలిక వారి కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజాభివృద్ధికి దోహదపడతారని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసన్న, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సీహెచ్ విజయ్‌కుమార్, అనురాధ, కార్డ్స్ సంస్థ జాయింట్ డైరెక్టర్ కె. పుష్పలత, ఆర్‌సీజేసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సుదర్శన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డి.జీవన్‌మణిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న నిపుణులు, పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రతాప్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దళితవాడుకు వెళ్లే దారిలో కరకట్ట వెంట తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్‌కే చాంద్ బాషా గ్యార్మీ వేడుక సందర్భంగా గుంటూరు జిల్లా చందోలులో నివసించే బామరిది ఇంటికి కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి వెళ్లారు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్నాయి. బీరువా చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. చాంద్ బాషా ఇంటో 3 జతల బంగారపు చెవి దుద్దులు, రెండు జతల బంగారు ఉంగరాలు, మొత్తం 16 గ్రాములు, వెండి 144 గ్రాముల వెండి పట్టీలు చోరీకి గురయ్యాయి. దీంతో పాటు రూ.36 వేల నగదు పోయినట్లు ఫిర్యాదు చేశాడు. పోలీసులు గుంటూరు నుంచి క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. ఎస్ఐ ప్రతాప్ త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

**మరో సంఘటన..**

సీతానగరంలో శనివారం ఓ మహిళ తన ఇంటి ముందు ద్విచక్ర వాహనం పార్కింగ్ చేశాడు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వేరే ద్విచక్రవాహనాన్ని అక్కడ నిలిపి ఆ మహిళ వాహనాన్ని చోరీ చేసినట్లు తెలియవచ్చింది.

## పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలి



దరఖాస్తులు తీసుకుంటున్న సీపీఎం నేతలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పేదలకు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి సెంటర్, బాపనయ్య నగర్ ప్రాంతాల్లో పర్యటించి అర్జీలను స్వీకరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ మంగళగిరిలోనే ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాలో బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌లో అర్జీలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చిన మేరకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. పైకార్యక్రమాల్లో కె.రామకృష్ణ, వెంకట్ నారాయణ, భక్తిరెడ్డి, ఇమ్మానియేల్ రాజు, నారిన నాగేశ్వరరావు, బొబ్బిలి రామారావు, కొట్టే కరునాకర్, సత్యం పాల్గొన్నారు.

## కృత్రిమ చేతుల పంపిణీ



కృత్రిమ చేతులు అమర్చుకున్న వారితో మంగళగిరి రోటరీ క్లబ్ ప్రతినిధులు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యాన దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ మంగళకరం అనే పేరుతో 17వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరి రోటరీ క్లబ్ మంగళకరం అనే నినాదంతో నాలుగు విడతలుగా సుమారు 900 మంది చేతులు లేని దివ్యాంగులకు పంపిణీ చేయడం సంతోషదాయకమన్నారు. భవిష్యత్తులో కూడా దివ్యాంగులకు ఓ సెంటర్ ఏర్పాటు చేసేవిధంగా రోటరీ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

దేశంలోనే మొదటిసారిగా చేతులు లేని దివ్యాంగులకు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి జర్మనీనుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక కృత్రిమ చేతులను పంపిణీ చేస్తోందన్నారు. కృత్రిమ చేతి విలువ సుమారు 60 వేల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్, రోటరీ డీజీఈ ఉదయ్ సుధీర్ ఫిలాని, రోటరీ పీడీజీ అన్నే రత్న ప్రభాకర్, రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి అధ్యక్షులు డీవీ నరసింహం, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి నిరంజన్ గుప్తా, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మించి.. నిర్లక్ష్యం చేసి!




ఏడాదిన్నర క్రితం ప్రారంభించి నిరుపయోగంగా ఉన్న పొన్నెకల్లు సచివాలయం-2

పొన్నెకల్లు(తాడికొండ): తాడికొండ మండలం పొన్నెకల్లులో సచివాలయం-2 నిర్మాణం పూర్తైనా నిరుపయోగంగానే ఉంది. సార్వత్రిక ఎన్నికల ముందే ఈ కార్యాలయం నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభించినా ఏడాదిన్నర నుంచి కార్యాలయంలోకి తరలించకపోవడంతో గ్రామస్తులకు ఇబ్బందిగా మారుతోందని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం సచివాలయం-1 ఆవరణ వెనుక ఉన్న పాడుబడిన రేకుల షెడ్డులో సచివాలయం-2 నిర్వహిస్తున్నారు. ఇది ఎస్టీ కాలనీతో పాటు సచివాలయం-2 పరిధిలో ఉన్న ప్రజలకు దూరంగా ఉండటంతో వృద్ధులు, మహిళలకు ఇబ్బందిగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి జాను ను వివరణ కోరగా వీలైనంత త్వరలో సచివాలయంలోకి సిబ్బందిని తరలించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## 'ఆర్‌ఎంపీ' ఆర్గనైజింగ్ సెక్రటరీగా వేణుగోపాల్

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ఆర్‌ఎంపీ అండ్ పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా తెనాలికి చెందిన నారాయణం వేణుగోపాల్ ఎన్నికయ్యారు. స్థానిక హోటల్‌లో మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు రాజా సిద్ధార్థ, ప్రధాన కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో వివిధ జిల్లాల్నుంచి వచ్చిన ప్రతినిధుల సమావేశంలో వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర, తెనాలి డివిజన్ ప్రతినిధులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు ప్రభుత్వ గుర్తింపు లభించేందుకు తన వంతు కృషిచేస్తానని హామీనిచ్చారు. తెనాలి డివిజన్ ప్రధాన కార్యదర్శి పుల్లారావు, కోశాధికారి రంగారావు, కోటేశ్వరరావు, భాస్కరరావు, వైఖానస సేవాసంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పచ్చళ్ల తయారీదారులతో సమావేశం



దుగ్గిరాల: స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి, పచ్చళ్ల ద్వారా ఉపాధి పొందుతున్న లబ్ధిదారులతో జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు బృందం సమావేశం నిర్వహించారు. మంగళవారం దుగ్గిరాల మండల సమావేశం మందిరంలో జరిగిన సమావేశంలో నేషనల్ రిసోర్స్ పర్సన్ నీలేంద్ర ముఖర్జీ మాట్లాడుతూ పచ్చళ్ల తయారీదారుల కోసం గుంటూరు జిల్లాకు టెక్ పార్క్ అంటే పచ్చళ్ల తయారీ సంస్థ ఏర్పాటుని తాడికొండ మండలం మోతడకలో రూ.22 కోట్లతో నిర్మిస్తారన్నారు. అనంతరం చిలువూరులో లబ్ధిదారుల కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో సెర్ప్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ వి.శేఖర్, మూర్తి, కిరణ్ కుమార్, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ అశోక్ కుయార్, దుగ్గిరాల ఏపీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.